# దుంపలబడి

గణగణమని గంట మోగింది.

"... అదర.... అదరొరి సివాఁ చెలఁవో బెల్లయి పోతంది. నువ్వేమో మూడు మెతుకులు తిండాకి ముసిలయిపోతన్నావు..." వినిపించే బెల్లులాగే రమణమ్మా గణగణ మంటుంటే- గుడగుడమని కడిగీ కడగని మూతితో పరుగెత్తుకొచ్చి పైట చెంగుకి తుడిచేసి, అంతలోనే పిట్ట గోడమీది పలకాపుల్లా అందుకొని పరిగెత్తబోయాడు. సింహాచలం వల్ల కాలేదు. రమణమ్మ జుత్తు పట్టి దువ్వేనేసింది. కారుతున్న తల నూనెకు జుట్టు జారింది. జుట్టుతో పాటే సింహాచలమూ జారి పోయాడు. అడ్డం పడుతున్న గుండారని బొడ్లో దోపుకొని వెంటపడి పరుగు తీసింది రమణమ్మ.

"ఒరే గండా! మీ యమ్మ నేమిరలాగ పరిగెత్తిస్తన్నావు...?" పక్కింటి పోలమ్మ పిన్ని మాటలకు పత్తాలేదు. పరుగే పరుగు!

'ఒరె దెష్టా.... గుండెల్లలి కొచ్చేస్తంది. నీ బుఱ్ర మీద పైనుందిరా.." నాలుగు బార్లు పరిగెత్తిన రమణమ్మ అరుస్తూ జాపోసిపోయి నిలబడిపోయింది.

అప్పుడు సింహాచలం క్షణకాలం ఆగేడు. ఆ క్షణ కాలంలోనే నెత్తిమీది దువ్వెన ఒంటి చేత్తో తడుముకొని తీసి, తల్లివేపు విసిరేడు. ఆక్షణంలోనూ జారిపోతున్న నిక్కరునోచేత్తో పట్టుకొని, మరో చేత్తో పలకాపుల్లతో పరుగు తీసాడు.

"నిక్కరు మొలతాడుకి దోపురొరే..."

అమ్మమాట గాల్లో కలిసిపోతుంటే పోస్టాఫీసు ఎదురు మెయిన్ రోడ్డుదాటి సందుల్లోంచి చెరువుగట్టు మలుపుతిరిగి బడి గోడ దగ్గరికి వచ్చాడు. బెల్లు మోగడం ఆగింది. కూలిన గోడ దారిలోంచి పరుగున వెళ్ళి వరుసలో నిల్చొని 'వందేమాతరం.... సుజలాం సుఫలాం మాతరం' అంటూ 'వందేమాతరం' పూర్తి చేసాడు.

"లైన్లో నెల్లండ్రోరే... మీకేన్రా..."

డ్రిల్లుమేస్టు బెత్తం గాల్లో ఊగినా ఒక్కొక్కడిది ఒక్కో వరుస. 'నీను ముందు'- 'కాదు నీను ముందు' అనుకొని 'ఎల్లబే-ఎల్లెల్లబే' ఒకర్నొకరు ఆడుకొని నేలమీద కూర్చున్నారు. ఆనేల పాతగది గోడల మధ్యనా వుంది. కొత్తరుగులా ముస్తాబయీ వుంది. వరండాలో.... ఇంకా నాగమణి, బాదం చెట్ల కింద అంతా నేలే, నేలమీద చీమల్లా పిల్లలు.

వరండాలో వతన్లోనే కూర్చున్నాడు సింహాచలం.

"కొత్త కడిపుల్ల. మాయమ్మ పదిపైసలిచ్చింది. పాలపుల్ల..." మటం వేసుకోక ముందే పక్కనున్న గిరిగాడు చూపించాడు. చిన్న ముక్క సింహాచలానికిచ్చాడు. కొత్త పుల్ల సంతోషంతో గబగబా పలక మీద 'అ' నుండి బండీ 'ఱ' వరకు రాసీసేరు. ఒకడ్ని చూసాకడు.... రాతలు కోతలు... వెరసి మోతలు...

బెంచీ వీపుని బెత్తం చీరి చీరి తనే చిరిగిపోయింది.

'ఒరే... ఇది బడే? లేకపోతే మనూరి శుక్రోరం సంతా...? నీనొచ్చి గంటయింది... చీరేస్తాను...' మేష్టుగారి పళ్ళు పటపట లాడ్డం చూసి పిల్లలు మెత్తబడి పోయారు.

మేష్టుర్లాని చివరి రెండుగదులు తప్ప బడిమొత్తం నిసంకుడయింది. "మేష్టుర్లారు... కాదు లేనే లేరు... మేష్టుల్ని వెయ్యరు..." హెడ్‌మాష్టారు ఏకపాత్రాభినయనం చేస్తూ ఆగదికి ఈగదికీ కడుపు గుప్ మన్నట్టు తిరుగుతునే వున్నాడు.

అవాల్టినుండి రెండోతరగతికి వెళ్తున్న ఆనందంలో వచ్చిన పేర్లన్నీ రాసి, పలక పట్టని పేర్లను ఎలకగొద్దుల్లా ఇరికిస్తున్నాడు సింహాచలం. ముక్కులోని చీముడు జరజరా కారి, ఎవరన్నా చూస్తారన్నట్టు బరక్ బరక్ మని లోపలికిపోయి దాగుంటోంది.

"యలంకాయలోయ్.. యలంకాయలు..."

మేష్టు అరుస్తున్నాడు.

"సింహాచలం.. యలంకాయలు. యలంకాయలు కొంటావేట్రా?" మేష్టుగారి పిలుపూ పక్కవాడి పొడుపూ తగిలి తలెత్తి చూసాడు సింహాచలం. వెనకనుండి ఎవరో ముడ్డిపట్టి తోస్తే లేచి నిల్చున్నాడు.

"నేనేటి యలంకాయలమ్ముతున్నానేట్రా.. యలంకాయల సింహాచలం నాయుడూ అని పిలిస్తే పలకవేటి? ప్రెజెంటు' వద్దా? రెండోతరగతి కెళ్తేటి ప్రెజెంటు పలకవా? మీకు రెండో తరగతికీ మూడో తరగతికీ నాల్గో తరగతికీ ఐదో తరగతికీ అన్నిటికీ నేనే మేష్టుని. కొత్త మేష్టు నెయ్యకపోతే ఆరుకీ ఏడుకీ నేనే పాటపాడాలి.... ఆడెమ్మని... ఛీ... కొత్త మేష్టుల్నెయ్యరు..." దండకం మధ్యలో "ఏటి దండాశి మేష్టూ... మొదలా?" అవతలి గదిలోంచి అచ్చుతరావు మేష్టు పిలిచాడు.

“ఆరుగురం మేష్టులం ఆరొందల మంది పిల్లలు. అప్పర్ ప్రైమరీ స్కూల్లా లేదు... ఇది ఏకోపాధ్యాయ పాఠశాలయి పోయింది...”

దండాశి మేష్టు మాట పూర్తి కాలేదు.

‘యస్సార్’ సింహాచలం అన్నాడు.

‘యస్సారేట్రా? అహ్ఁ నీను కరెక్టు మాట్లాడాననీసేనా, నీ వుద్దేశమేటి? యస్సూ.. నో... నీ యిష్టమేనా?” బెత్తం తిప్పారు మేష్టుగారు.

‘యస్సారు’ మళ్ళీ అన్నాడు సింహాచలం.

‘నిన్నూఁ...’ మేష్టు అరుపుని అందుకొని అరచి గీ పెడుతున్నాయి బడి మెయిన్ గేటు కవతల బస్సులూ లారీలు.

ఎప్పటికీ ఆగని హారన్లహోరుకి మేష్టుగారి కోపం అటు తిరిగిపోయింది. “ఛీఁ... సంత, బడిలో సంత, బయటా సంత, నేషనల్ హైవే మీద.. మన మూడు రోడ్ల జంక్షన్లో ట్రాఫిక్ జామ్... బస్..... రోజంతా సంతే...” మేష్టుగారి గోడు వినేందుకు గోడలూ లేవు.

మేష్టుగారి మాటలు వినపడక, తననే ఇంకా తిడుతున్నారనుకొని అప్పటికి ‘యస్సార్- ప్రెజెంటుస్సార్- వచ్చేన్ను సారు- పలికేన్నుసారు’ ఇలా నాలుగుసార్లు పలికి నలకపడ్డట్టు కంట్లో నీళ్ళు తప్పుకున్నాడు సింహాచలం.

హారన్ల రొద పల్చపల్చగా చెదిరిపోతుండగ అర్థంచేసుకున్న మేష్టుగారు “క్లాసు తడిపీకురా యలంకాయలూ.. ఆపు. ఆపు అవున్రా అదేమిట్రా చొక్కా అంతా ఎంగిలే, చెయ్యయినా కడుక్కోని వచ్చావా?” అడిగేరు.

సింహాచలం చేతిలో పలకపుల్ల వుండగనే చెయ్యెత్తి శుభ్రంగా వుందన్నట్టు చూపించాడు. జారుతున్న నిక్కరు మరో చేత్తో పట్టుకున్నాడు. ముక్కు చీమిడ్ని ఎంత బంధించినా అది వినకుండా వచ్చి వెనక్కి పోతోంది.

“చొక్కాకా గుండిలు తగిలించడ మేట్రా? కొత్త పేషనా?” మేష్టుగారు నవ్వారు. పిల్లలూ నవ్వారు. పక్కనేవున్న జానకి సింహాచలం చొక్కా గుండీలు సర్దింది. సింహాచలం చొక్కామీది ఎంగిలి తుడుచుకున్నాడు. కాని ఇగిరిపోయిన గెంజి జోరికలు కట్టి వుంది.

మేష్టు ‘ముక్కు’ అనక ముందే సింహాచలం వరండా దిగి బుడుక్ మని చీదేసి చొక్కాతోనే ముక్కు తుడుచుకున్నాడు.

“ఒరే యలంకాయలూ... ఒకటో తరగతి లాగే రెండో తరగతిలో నీదే ఫస్టు నెంబరు’ మేష్టారి మాటకు సింహాచలం చాలా గొప్పయిపోయి వున్న చోట్లోంచి పలకపట్టుకొని రాసినవి చూపించడానికి టేబుల్ దగ్గరకు వెళ్ళాడు.

"మిగతా హోలుకి ప్రెజెంట్లేసి నెంబర్లు చెప్పొద్దా.." మేష్టుగారి మాటతో మళ్ళీ తనజాగాలో వచ్చి కూర్చున్నాడు.

అరవై మంది పేర్లూ చదివేసరికి గంట పైగా పట్టింది. మేష్టుగారికి ఓపిక తగ్గి టీ తెప్పించుకు తాగి, అరగంట అరుపుల మధ్య అలవాటుగా కూర్చున్నాడు. ఆగని సింహాచలం నాయుడు పలక చూపించాడు వాడి వెనకాలే గిరి, జానకి, లక్ష్మి, మహరణ, పండా, జాన్, రహీమ్..... అందరున్నూ, మేష్టుగారు చూడకుండానే రైట్లు పెట్టారు.

సింహాచలం టేబుల్ దగ్గర నిలబడి నిలబడి మేష్టుగారు పెట్టిన సంతకమో, రైటో తెలియని కొక్కిరి గీత వంక వళ్ళు తెలియని ఆనందంతో చూస్తున్నాడు. తన పలకమీది కొక్కిరి గీతని ఖళా ఖండంలా తిప్పి తిప్పి చూసాడు. పలక వాసన కూడా చూశాడు. సుద్దముక్క వాసన భలే గమ్మత్తుగా వుంది. ఆ సంతకాన్ని అలాగే అమ్మకీ నాన్నకీ చెల్లికీ చూపించాలని పించింది. మేష్టారు వంక చూసాడు. ప్రేమ పొర్లుకొచ్చింది. టేబుల్ మీద చెయ్యి వేసాడు. బెత్తాన్ని ఆప్యాయంగా నిమిరాడు.

"కావాలేట్రా?" మేష్టుగారు నవ్వేరు. కావాలన్నట్టు తలూపి, చెయ్యి చాపి అరచేతిని చూపించాడు సింహాచలం. మేష్టుగారు బెత్తం తియ్యబోతే జారుతున్న నిక్కర్ని ఎగేసుకోకుండా అక్కడ్నుంచి నవ్వుతూ తన జాగాలోకి పరిగెత్తాడు.

అంతే...

ఫటక్!

చెయ్యి జారి పలక ఫటక్ మంది.

పిల్లలందరూ నిశ్శబ్దమయిపోయి సింహాచలం వేపు చూసారు. మేష్టుగారు కూడా. సింహాచలం పలక వంగోని తీసాడు. ముక్కలన్నీ నేలమీదపడి కర్రదండి మాత్రం చేతిలోకి వచ్చింది. దండిని తిప్పి తిప్పి చూసాడు. దండిలోంచి చూసాడు. మేష్టుగారు ఫోటోలో వున్నట్టు అగుపించారు. అంతలోనే అగుపించకుండా మాయమయ్యారు. కళ్ళలో నిండా నీళ్ళూరాయి. అవి కనుకొలకల్ని దాటి టపటపమని విరిగిన ముక్కలపై పడి రాసిన అక్షరాల్ని తడిపేసి చెరిపేస్తున్నాయి. మేష్టుగారి సంతకాన్ని కూడా.

చొక్కాతో కళ్ళు తుడుచుకొని అలానే కూర్చుండిపోయి బల్ల ముక్కల్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఏడుపు ఆగడం లేదు. ఇంకా బాధ పెడుతూ మేష్టుగారి సంతకం.. దాని మీద పడ్డ కన్నీళ్ళని తుడవబోతే సంతకమూ చెరిగిపోయింది. ఏడుపు గొంతులోనే ఇమడలేదు. బయటికే 'అమ్మాం..' అని ఏడ్చాడు.

మేష్టుగారు సీట్లోంచి లేచి వచ్చి 'ఊరుకోరా... ఏడుపు దేనికి? ఊరుకో.." సింహాచలం భుజం పట్టి బుజ్జగించి ఓదార్చారు.

ఇంతలో ఇంటర్వెల్లు... టంగ్ టంగ్ మంటూ..

చీమలు చెదిరిపోయినట్లు పిల్లలున్నూ...

ఆనకట్టకు గేట్లు ఎత్తేస్తే పొర్లుతున్న నీటి హోరులా...

"వెళ్ళు ఆడుకో... ఇంటర్వెల్ అయిపొద్ది.." మేష్టుగారు సింహాచలాన్ని గాబరాపెట్టారు. చూట్టూ గుంపులా పిల్లలు.

సింహాచలం కదల్లేదు. మెదల్లేదు. అలాగే కూర్చున్నాడు. విరిగిన పలక ముక్కలన్నీ ఏరి దొంతి పెట్టాడు.

"ఏట్రా యలంకాయలూ!... ముక్కలన్నీ కూరొండుతావేటి?" నవ్వి 'ఒకటో తరగతి పాతపలకే..? రెండో తరగతి కొచ్చేసావు. కొత్త పుస్తకాలతో కొత్త పలక కొంటార్లేరా..." మేష్టుగారు ధైర్యమివ్వడంతో మిగతా పిల్లలు రెక్కపట్టి లాగడంతో సింహాచలం కదిలాడు. పిల్లల్తో కలిసాడు. కలిసాడేగాని మనసు మనసులా లేదు.

పిల్లలంతా దొంగాటలు. గుంటికాలాటా.. పరిగెత్తడాలు..! మేష్టుగారికీ టీ తెస్తున్న పానకాల్ని గుద్దేసారెవరో వాడి వల్లంతా అయిపోయింది. కాలిందేమో తిట్టుకుంటుంటే "అంత వేడిగుందేట్రా టీ.." మాష్టారి ఎకసెక్కం... వాడు పిల్లల్ని తిడుతుంటే నవ్వులు.. సింహాచలం నవ్వినా నవ్వినట్టు లేదు. మెయిన్ గేటుకి తాళం వేసినా సందుల్లోంచి "ఐస్...ఐయిస్... పాలైస్, జంతికలేయ్ సుప్పులేయ్.. జీడిలు సున్నుండలేయ్... ఉడకబెట్టిన దుంపలేయ్..."

అరుపులు... 'నా దగ్గిరికి రా అంటే నాదగ్గరికి రా' పిలుపులు.

గిరి సింహాచలాన్ని గేటు దగ్గరకు తీసుకుపోయాడు. వాళ్ళ వెనకాలే మరో ఇద్దరు వచ్చి చేరారు.

"ఏటి కావాల్రా నీకు..?" గిరి సింహాచలాన్ని అడిగాడు.

"పలక..." అన్నాడు సింహాచలం.

"బాబోయ్ పలకే.. పది పైసలకి పలక రాదు. పది రూపాయలుండాలి" అన్నాడు గిరి. వాడు నొసలు చిట్లించడం చూసి "పలక కొనమని కాదు, పోయిందని.." ఏదో చెప్పబోయాడు సింహాచలం.

"మేష్టుగోరు చెప్పారు కదా, రెండో తరగతికి కొత్త పొస్తకాలతో కొత్త పలక కొనమను" అన్నాడు, గిరి. సింహాచలం ముఖంలోకి చూసి మళ్ళీ అన్నాడు "ఇంట్లో అడిగితే ఎవరో మట్టేసారని చెప్పు. నీనొచ్చి 'ఊ' అంటాన్లేరా.."

"బాబూ గిరీ జీడిలూ సున్నుండలు.." ఈగల్ని తువ్వాల్తో విదిలిస్తూ శెట్టి పిలుపు.

'అయ్యా ఉడక బెట్టిన ఇచ్చి దుంపలయ్యా.. వేడివి" ముసలమ్మ గొంతు.

శెట్టి ముసల్దాన్ని తిట్టి పొమ్మన్నాడు.

"నానెందుకుపోవాల.. నువ్వే పోరా..." ముసల్ది తగ్గలేదు.

టగాపోరయ్యే సమయానికి టకీమని దుంపకొనుక్కొని వెనుదిరిగారు వీళ్ళు. వాళ్ళింకా పొట్లాడుకుంటూనే వున్నారు.

ఇచ్చిన దుంప సులువుగానే ముక్కలయింది. నలుగురూ నాలుగు ముక్కలు పంచుకున్నారు.

'బెల్లయిపోయిందిరా' సింహాచలమన్నాడు.

అందరూ పరుగెత్తి వరండా క్లాసులో చేరారు.

"వస్తానండీ. చదివిన ఎమ్మే బియ్యేడికీ వీళ్ళిచ్చిన సెకండరీ గ్రేడు టీచరుకి వెయ్యా-పన్నెండొందల చొప్పున రెండేళ్ళు దాస్యం చేస్తే... అప్పుడు ఫుల్ జీతమనే గోసికి కురుస జీతం. వాళ్ళిచ్చిన దానికి చెప్పిందెక్కువే వస్తాను మరి.." కొత్త మేష్టు వెళ్ళిపోతూ "దండాశి గారూ హెడ్ మాష్టారడిగితే అలా బయటకెళ్ళాననని చెప్పండి, నే వెళ్ళి 'ఎమ్పీడీఓస్'కి ప్రిపేరవాలి' అన్నాడు.

"నలభైలో ఉద్యోగమొస్తే యాభై ఎనిమిదిలో రిటైర్ మెంట్. రాష్ట్ర ఖజానా దివాళా. యాభై ఏళ్ళకే రిటైర్మెంట్ వి. ఆర్.యస్. ప్రపోజల్. పదేళ్లకు మించి కష్టపడక్కర్లేదు.." దండాశి మేష్టు నవ్వుతున్నాడు.

కొత్త మేస్టు ఆసక్తిగా వెనక్కొచ్చాడు.

"మా బావమర్ది క్వాలిఫైడ్ టీచర్. అంటే మూడు వందల తొంభైఎనిమిది రూపాయల జీతగాడు. వాడిది గుడ్డి కన్నయితే నాదిమెల్లకన్ను..." కొత్త మేష్టు అన్నాడు.

అప్పుడే వచ్చిన అచ్యుతం మేష్టు బాతాఖానీ బఠాణీ గింజలు పంచుకున్నాడు.

"జనాభా లెక్కలూ... దారిద్ర్య రేఖ దిగువ లెక్కలూ... ఆర్థికసర్వే ఎగువ లెక్కలూ... ఎలక్షన్ల డ్యూటీ... ఓటర్ల జాబితా తయారీ... అన్నింటికీ పేరంటాళ్ళలా మనల్ని ముస్తాబు కమ్మంటారు...'

టీలు వచ్చాయి. మేష్టర్లు తాగుతుంటే అర్థంకాని పిల్లలు గుటకలు మింగుతున్నారు.

కొద్దిసేపటి తర్వాత సింహాచలం జాన్గాడి కొత్త తెలుగుపుస్తకం తీసుకెళ్ళి మేష్టుగారి చేతిలో పెట్టి చెప్పమన్నట్టుగా చూసి తలగోక్కున్నాడు.

"చదవేసి మేము దేశాన్నింత ఉద్ధరించేసాం... నువ్వూ ఉద్ధరించిరా? ఊరికి గాబరా పడిపోతున్నావ్..." కొత్త మేష్టు కోప్పడి పుస్తకం వెనక్కి విసిరేసాడు.

సింహాచలంకి కోపమొచ్చింది, అయినా కిమ్మనకుండా వెళ్ళి పుస్తకం తీసుకొని తన జాగాలో కూర్చున్నాడు.

అరగంట తర్వాత అందరు మేష్టర్లూ ఎటువాళ్ళటు కదిలేరు. సింహాచలం వాళ్ళకి కొత్త పాఠం మొదలు కాలేదు. ఏయే పుస్తకాలు కొనుక్కోవాలో చెప్పారు. కొద్దిసేపు పిల్లలంతా ఖాళీగానే

కూర్చున్నారు. కబుర్లు చెప్పుకున్నారు. అప్పుడప్పుడూ మేష్టారు బెంచి మీద దరువేస్తూ సైలెన్సు అంటున్నారు.

సరీగప్పుడే లాంగ్ బెల్లయింది.

అందరూ పరుగులే. ఉరకలే, మెయిన్ గేట్ రద్దీగా వుంది. జానకి లక్ష్మి, జాన్, రహీమంతా మెయిన్ గేట్లోంచి వెళ్తుంటే సింహాచలం, గిరి బడి వెనుక కూలబడ్డ గోడ దారి వెపు వెళ్తుంటే, జానకి చూసి పరుగున వచ్చి అటెందుకురా' అంది.

"టాపిక్..టాపిక్..." అన్నాడు సింహాచలం. వాడి చేతిలో విరిగిన పలక ముక్కలు మరో చేతిలో దండి వున్నాయి. నిక్కరు పెదముడుకుల్ని దాటి ఫుల్ ఫేంటూ కాక ఆఫ్ నిక్కరూ కాకుండా వుంటే 'ఏట్రిది' అని నవ్వింది.

"ఎత్తియ్యే.. మొలతాడుకి దోపీ.." అన్నాడు సింహాచలం.

జానకి నిక్కర్ని మొలతాడుకి దోపి, "మీమంతా వున్నాంకదా రోడ్డు మీదనుంచి పోదాం వచ్చియ్యండి" అంది.

ఆ మాటకు "అమ్మోః.. రోడ్డు మీద నుండే?... మాయమ్మా ఈలమ్మా వద్దంది. బస్సులూ లారీలు రాలేము దాట్లేము" అన్నాడు గిరి. అవునన్నట్టుగా తలూపేడు సింహాచలం. 'అలెలిపోతన్నరు, మీ యిష్టం.." జానకి గేటు కాసి పారిపోయింది.

గిరి, సింహాచలం కూలిన గోడదాటి చెఱువు మీదగా వచ్చి, రోడ్డు దాటి పోస్టాఫీసు పక్కనుండి ఇల్లు చేరారు.

ఇల్లు దగ్గరపడుతుంటే "ఆ బల్ల ముక్కలు పారీరా..." అన్నాడు గిరి.

"అదికాదురా ఈ ముక్కల్తోటి పలక పుల్లల్లేనప్పుడు రాసుక'వచ్చు.." ఎదురుగా ఏమొస్తోందో చూడకుండా వాటివంకే చూస్తూ నడుస్తూ అన్నాడు.

"మరి మీయమ్మ..." గిరినోట్లోమాట నోట్లోనే వుంది.

"అక్కా... నీకొడుకు నిన్ను పెందిల పరిగెట్టించినాడా.. వస్తాదిలాగున్నాడు కదా... ఎక్కడ బూమిని గుద్దేండో సూడు" పోలమ్మ కేక వేసింది.

గుమ్మంలో కొచ్చిన రమణమ్మ "ఛ్చొచ్చొ..:ఛ్చో... నీ జిమ్మబడిపోతే ఎంత పని సేసినావురా కొత్త పలక. ఉక్కుముక్కలాటి పలక... ఇరిపేనావా? ఇరిపీసి నీ ఎదాన కొట్టుకున్నావా? వుండు... యిక నుండు దేనిమీద రాస్తావో... నీ మోర మీద రాస్తావో రాసుకో..." కోపం పట్టలేక కళ్ళెఱ్ఱ జేసి కొంగు నడుంచుట్టూ తిప్పి దోపింది.

సింహాచలం అడుగు ముందుకీ వెయ్యక అడుగు వెనక్కీ వెయ్యక అలానే వీధిలో గుమ్మం ముందు నిలుచున్నాడు. వెనకాలే గిరి నిల్చున్నాడు.

''ఈ కాలం పిల్లలకి ఇనుం పలక లిచ్చినా ఇరుపుకొస్తారు వదినా నీకు తెల్దేటి గాని,'' అని రమణమ్మతో అని ''ఏటల్లుడూ ఎవల్తోటి కుస్తీపట్టులు పట్టినావా?'' సింహాచలాన్ని అడిగింది సీతాలత్త.

''అల మేష్టులవే సెప్పతన్నారు గావాల. మన బరుల్లంట ఏటి సెప్పుతారు...'' పోలమ్మంది.

''మీ మేష్టుబుర్ర మీదేసీ లేపోనావా? పలకతోటొక్కటి. పాఠాలయినా సుబ్బరగ సెప్పుదుడు..'' సీతాలత్తకి సవ్వాగడంలేదు.

రమణమ్మ అరుగు దిగి కోడుకు జుత్తందుకొని.. ''అలాటోడు కాడా.. ఇలాటి మెత్తగున్నోళ్ళే కొంపలు కూల్చేత్తారు. అయినా నువ్వెళ్ళింది సదువుకే? ఆటకే..'' అంటూ వీపొంచి అట్టు లెక్కపోయినట్టు, తన అరచెయ్యికంది పోయినట్టు కొట్టింది. సీతాలత్త, పోలమ్మ పిన్ని వచ్చి ఆపు చేసారు.

కిక్కురు మనలేదు సింహాచలం.

''ఏటయిందో సెప్పకపోతే నీ కింట్లోకి రానివ్వను గాక రానివ్వను... అలాగే ఆకలితో సవ్వు..'' రమణమ్మ పళ్ళు పటపటకొరికింది.

''సెప్పీరయ్యా సెప్పీ.. సెప్పీమీ'' పోలమ్మ పిన్ని బతిమలాడింది.

సింహాచలం నోరిప్పలేదు.

'''ఈడి జీవాలార్పేస్తాను.. ఈడి కిలక్కాదు. కొర్రయ్యి తెచ్చి నాలిక్కంటీస్తే ఏకంగా ఎప్పుడూ నోరిప్పలేకుండయి పోతాడు..'' రమణమ్మ అన్నంతపని చేయడానికి సిద్ధమైంది.

''మరి..మరి.. మరేమొచ్చి... నీనే మట్టీస్నాను...'' అన్నాడు గిరి.

''ఏటి? నువ్వు సేసిన గాముండమా ఇది..'' రమణమ్మ గొంతులేవబోయింది.

అప్పుడు సింహాచలం గొంతు విప్పాడు.

''అడుకాదే అమ్మోఁ.. అడుకాదు..''

''మరెవుర్లా?.. దాని మట్టుకదే వల్లు సలుపయి ఇరిగిపోనాదేటి?'' రమణమ్మ ఒళ్ళు కుతకుతలాడుతోంది.

''ఒకటో తరవతి పలక్కదే... రొండో తరగతి కెలగా కొత్త పొస్తకాలు కొంతారు కదా...'' సింహాచలం మాటదొరక్క గాలి నమిలాడు.

''రొండో తరగతికి కొత్త పోస్తకాలు కొంతే?... ఆఁహఁ.. అంతే ఒకటో తరగతి పలక రొండో తరగతికి వాడపని మాట.. నీ బొగ్గర వలగుందిరా నువ్వయినా ఏటి సేత్తావ్.. సూడొదినీ... సూడు సెల్లీ...'' రమణమ్మ విస్తూ పోయింది. గుండెలు బాదుకుంది.

"అలయ్య ఇండియాకి ఇస్టెంటు అయున్నాడు కదా... అడికేటి..." కూడబలుక్కున్నట్టుగన్నారు సీతాలత్త, పోలమ్మ పిన్ని.

"మా మేష్టుగోరు అలగే సెప్పారు కదరా" గిరిగాడిని సాక్ష్యం అడిగాడు సింహాచలం.

"ఊఁ.. అంతానన్నాను కదా ఊవేఁ.." మాట తప్పని స్నేహాన్ని చాటాడు గిరి.

"ఆహాఁ... మీరిద్దరు కలిసి ఆడిన గూడుపుటానీ మా బాగుందిరా.. మా కడుపుల పుట్టి మాకే కతలుసెప్పుతన్నారు.."రమణమ్మ మాటలు పూర్తికాలేదు.

"ఎంత పద్దుకు మాలిన మేష్టేరయినా ఒకటో తరవతిది పాత పలకని ఇరిసీమంటాడా? మాయన్నొస్తే బరికి పంపు తేలిపోద్ది..." సీతాలత్త అంది.

"అవును.. ఇప్పుడేల ఈడిని సీరాల.. అప్పుడే ఉప్పు వఁరా ఎట్టీనా.. పాతరేసీనా గొల్లిగాడయినాడని.." రమణమ్మ తడిపి ఆరేసిన బట్టలు తీస్తోంది.

"వస్తాఁనా సింహం.." అన్నాడు గిరి వెళ్ళిపోతూ.

"టాటా" చెయ్యి ఊపాడు సింహాచలం.

"పట్టులు పడ్డానికిరా నువ్వు సింహం. ఆడేటి నీయనక నక్కా?" తల్లి ఉక్రోషం కన్నా ఆమె మాటకి కిసుక్కున నవ్వాడు సింహాచలం.

"నవ్వుతావురా నువ్వు నవ్వుతావు. గాలి పట్టిపోనావు. నువ్వు మరి లొంగవూ వంగవూ.. నువ్వు సదివిన బరి అలాటిది రా.." రమణమ్మ తిడుతూనే వుంది ఈలోగ చేతిపిల్ల వచ్చీరాని అడుగులేసి అరుగు మీద నుండి కింద పడి ఊపిరి బిగబట్టేసింది.

"ఓల్నాకూతురో.." పరుగెత్తుకెళ్ళి పిల్లని తీసి ఎత్తుకొని దులిపి "లేదే... లేదే నా తల్లి నాదనవు......" అంటోందే గాని, పిల్లని చూసి కంగారు పడిపోయింది. గుక్క పట్టీ సిందేమో ఏడుపు లేదు. రమణమ్మ ఒల్లు సల్లబడిపోయింది. సీతాలత్త పిల్లని లాక్కుంది. కదిపి ఊరడించి ప్రయత్నిస్తోంది.

సింహాచలంకి భయం వేసింది.

అమ్మాఁ..

అని తల్లి దగ్గరకు వెళ్ళాడు.

ఆ కోపంలో మఁరెండు వీపుమీద వేసి, జుత్తుపట్టి అకాలించి "ఈడు ఇంట్లేవుల్ని బతకనివ్వడమ్మాఁ.. ఈడి పాలపడి పిల్లని పట్టించుకోలేదు పాపిస్టి దాన్ని.." చేతికి ఎంత దెబ్బొస్తే అంత దెబ్బ...

సింహాచలం కిక్కురుమనలేదు.

చేతిపిల్ల మాత్రం కిఁయ్యిమంది.

రమణమ్మ గక్కురమన్న ప్రాణం లేచొచ్చింది. పిల్లనందుకుంది. ఎవరో పాలు పెట్టమంటే అరుగు మీద కూచొనే పిల్లకు పాలిచ్చి.. ఊరడించి.. నానా జెంజాటు పడింది.

కొంతసేపటికి పిల్ల తేరుకుంది.

వీథిలోకి అమ్మలక్కలు ఎటువాళ్ళటు వెళ్ళిపోయారు.

సింహాచలం మళ్ళీ తల్లి పక్కన చేరి చెల్లిని ముద్దులాడాడు. అదీ భయం భయంగానే. రమణమ్మ ఏమనేదో గాని అప్పుడే దాని పెనిమిటి దాలినాయుడు డ్యూటీ దిగి వచ్చాడు.

పిల్లని ఉయ్యాల్లో వేసి పెనిమిటికి భోజనం పెట్టింది.

దాలినాయుడు భోంచేయడానికి కూర్చుంటూ సింహాచలాన్ని కళ్ళతోనే రమ్మన్నాడు. వాడు వచ్చి తండ్రి పక్కనే అయినా కంచానికి ఎడంగా కూర్చున్నాడు.

"అన్నం తినీసావేటి?" దాలినాయుడు కొడుకుని అడిగాడు.

లేదన్నట్టు అడ్డంగా తల ఊపాడు సింహాచలం.

దాలినాయుడు ముద్దలు కలిపి సింహాచలానికి అందించాడు. తల్లివంక చూస్తూ తండ్రిచ్చిన ముద్దల్ని మింగుతున్నాడు.

".. అడ్ని అలగే మేపు.. పెద్దయితే నీకు గుద్దడానికయినా ఆడికి బలముండాలి కదా.. అసలే సింహమట'.." రమణమ్మ ఆఖరి మాటకి సింహాచలం నవ్వాపుకోలేక పోయాడు. వాడి నవ్వు చూసి దాలినాయుడు కూడా.

తండ్రీ కొడుకులిద్దరూ పాలమారారు.

గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఎత్తినట్టుగా పెట్టింది రమణమ్మ

"నువ్వింకా తిన్లేదు కదా, కూరల కారమెక్కువేసినావేటి?" దాలిగాడి ఎకసెక్కం ప్రశ్న.

"సేనలే పిల్లడు సెడిపోతుంటే కళ్ళంట నోటంట ఇర్రించడం మానిసీ ఇకఇకలు పకపకలయితే నీలాగే నీ కొడుకు బతుకూ అయిపోద్ది. ఇప్పుడు తెల్దు..." అంటూ సింహాచలం ఉరఫ్ 'సింహం' కథంతా చెప్పింది.

దాలినాయుడు ఎప్పుడూ లాగే కొట్టలేదు. తిట్టలేదు. తీక్షణంగా చూసాడు.

అంతే.

"చెయ్యి జారిపే పలక - చెల్లి కింద పడిపే.." పాడిపాడిగా సమాధానమిచ్చాడు సింహాచలం.

"చదివితే ఎంత దాకైనా ఎలాగో కిందా మీదా పడి చదివిస్తాను. డింకీలు గుంకీలు కొడితే మాత్రం అంతే.. అక్కడితో సరి... ఏ హోటల్లోనో, షెడ్డుల్లోనో పెట్టేస్తాను. నీను చేసిన డ్రైవర్ ఉద్యోగానికి నాకొచ్చిన పద్దెనిమిదొందలూ రెండు వేలుకీ.." దాలినాయుడు చెప్పుకుపోతుంటే-

"ఒకటో తరవతికి ఫస్టే.. రొండో తరవతికి ఫస్టే.." రోలు నంబర్ని తలచుకొని చెప్పాడు సింహాచలం గొప్పగా.

"అప్పుడే రొండో తరవతి నువ్వెలాగ ఫస్టయిపోయావురా?" దాలినాయ్డుకి అర్థం కాలేదు.

"నీకు తెలీదులే. మేష్టుగోరు చెప్పితే.. ముందల నన్నే పిలిచినారు 'యలంకాయ సింహాచలం నాయుడూ' అని" తల్లి దుక్కు గొప్పగా చూసి తండ్రికి చెప్పాడు.

"యలం పండు' ఎక్కడున్నా వాసనేర్రా బుజ్జిపండు.." ఇంటి పేరుని వంశాన్ని తలచుకొని భుజాలెగరేసి కొడుకుని దగ్గరగా లాక్కున్నాడు దాలినాయుడు.

'యలంపండు ఎక్కడున్నా వాసననీసి వగ్గీస్తే తెలకుండానే కుళ్ళిపోతాది.' పూర్తి చేయని రమణమ్మ మాటకు తుళ్ళిపడి చూసాడు దాలినాయుడు.

"కాకపోతేటి ఇలాటి బరుల్లో సదివి కడాకి ఓటల్లో సెడ్డుల్లో ఎట్టేకంతే ఇప్పుడే ఎందలోనో ఎట్టిస్తే నయం. లేదంతావా అప్పులో అప్పు.. సప్పులో సప్పు. మనం మన పిల్లలికి ఎలాగా ఆస్తి పాస్తీ ఇవ్వనేం. ఇస్తే గిస్తే రొండచ్చురం ముక్కలు. ఇదిగిది నా మాట కాదు. నీ మాటే. మరి ఈ బరుల్లో నాబం లేదు. సుకం లేదు. మొరుడు ముండ పాపల్తో కూడి మొరడయే పోండు. ఆ మేష్టేర్లయినా ఏటి సెప్పుతారు? మందకి మంద.. మనకిదే ప్రాప్తం అనుకుంతే.. ఇంతే.. ఇలగెలిపోడమే కాలం.." ఇంకా నొళ్ళబోయేదే రమణమ్మ, కాని దాలినాయుడు 'పాడిన పాట పాడక, ఏటి చెయ్యాలో చెప్పు' అన్నాడు.

"నీను సెప్పడమేటి యింటి ఎచ్చాయలు సూత్తన్నావు నీకు తెల్దా? నువ్వే పెతీదసా... 'ఓలి రమణమ్మా.. సింవాచెలం గోడ్ని దుంపల బడిలెయ్యకోడదే.. కాన్వెంటులో ఎయ్యాలి.. ఇయాల్రేపు సదువంతే వట్టి పోటీకాదు కుస్తీ పోటీ. మామూలు సదువులకి మర్రోజులు కావే. ఇకన ఇంగిలీసు సదువు లైతేనేనే, మేలు. ఇలువ అన్నావ్, మరి మీయమ్మ సచ్చిపోవడం. మనకి తొలుసూరు మలుసూరు పురుడూ పున్నేలు వచ్చి అప్పులకీ వడ్డీలమైపోయి నడ్డిరిగిపోయి సితక్క సతికిల బడిపోనాం. కాన్వెంటు సదువు కలయిపోయింది.." నిట్టూర్చింది రమణమ్మ.

అంతకంటే పెద్దగా నిట్టూర్చాడు దాలినాయుడు.

చాలాసేపు ఎవ్వరూ ఏమీ మాట్లాడు కోలేదు.

పిల్ల లేచింది. తల్లిపాలు పట్టాక చెల్లిని ఆడిపించడం మొదలు పెట్టాడు సింహాచలం. ఒకటో తరగతి తెలుగు వాచకం అట్టమీది బాబు బొమ్మ చూపించి 'ఇది నీను' - పాప బొమ్మ చూపించి 'చెల్లీ ఇది నువ్వు..' అన్నాడు. అది 'వుంగా' అంటే అమ్మా చెల్లి 'ఊ' కొడతందే" ఆనందంగా అరిచాడు.

ఆ తర్వాత రమణమ్మ ఎంగిలి కంచాలు తీసి తోముకొని, వంటా వార్పుల్లో పడింది. దాలి నాయుడు బజారుకెళ్ళిపోయాడు.

ఆ రాత్రి పక్కలో మళ్ళీ అవే మాటలు.

ఎప్పటి అవే మాటలే...

"గురుపుల [illegible]ాసీయే ఆడి కొడుకుని కాన్వంటు లెయ్యలేదా?"

"అవును, సుబ్బారావు గుమస్తా ఇద్దరు పిల్లల్నీ ఇంగ్లీషు బడుల్లో యేశాడు"

"మరి మీ జంగం గురువులు.. అంతెందుకు జీడిపప్పు బడ్డీ పప్పు బడ్డీలకెళ్ళి వచ్చిన రాములమ్మ మనవణ్ని ఎంద[illegible]ది?"

"పిల్లల్ని ఇంగ్లీషు బడుల్లో ఎయ్యకుండ వుంచిస్తే మటుకు ఏటి కూడెట్టేస్తాం".

"నీనన్నది అదే ఉల్లిపాయ వజ్రకాయ నంచుకున్నా ఎవడొచ్చి మూతులు మూజూస్తాడు? ఏమీ పుప్పుడు నంజుడు జావ వండుకున్నావని అడిగినోల్లేరు. అదవా అడిగినా ఆలేటి పెట్టేత్తారూ? కడుపు కట్టుకొనైనా పిల్లలకొక బవిసత్తు ఇవ్వాల".

దిగాకే ఈత[illegible]తూ తెలుసుకుందామనుకున్నారా పెనిమిటి పెళ్ళాలు. వాళ్ళ కళ్ళ ముందు వాడు కడుపులో వుండగ వాడికంటే ముందు కలల్ని కన్నారు. అవన్నీ నెమరు వేసుకొని మురిసిపోయారు. నవ్వుకున్నారు. ఏడ్చుకున్నారు.

పిల్లయితే పడుకుంది. సింహాచలం పడుకున్నా మెలకువగానే వున్నాడు. తండ్రి వచ్చి తలనిమిరి లేచాక రమణమ్మ కొడుకు దగ్గరగా వచ్చి పడుకుంది. "పడుకుండి పోయావురా అయ్యా... ఎన్ని దెబ్బలు కొట్టేన్ను పాపిష్టిదాన్ను.." తనకి తనే తిట్టుకొని వాడి వంటి మీద దెబ్బల్ని తడిమి ఏడ్చేసింది. పిల్లలు లేస్తారని చెప్పి ఆమెని పక్కకు తీసుకెళ్ళాడు దాలినాయుడు.

అమ్మ కొట్టినప్పుడు రాని ఏడుపు అమ్మ ఏడ్చినపుడు వచ్చేసింది. కిక్కురమనకుండా లేవకుండా అలానే పరుపులో కళ్ళని ఇవరబెట్టేసాడు సింహం గుంటడు.

తెల్లవారింది.

ఎవరి పనుల్లో వారు పడ్డారు.

సింహాచలం మాత్రం దిగులు. పలక పోయిందని, అలాగే కూర్చున్నాడు. లేచే సరికే తండ్రి వెళ్ళిపోయాడు. అమ్మనడిగితే 'కొంటార్లేరా. అనగానయిపోవాలంటే ఆ రాజుకయినా అవదు' అంది. అమ్మ బలవంతంతోటే పళ్ళు తోముకొని చల్దన్నం తిన్నాడు. పిలుస్తున్నట్టు స్కూల్ బెల్ 'కీ' ఇచ్చినట్టు పరిగెత్తాడు.

పలకా లేదు. రెండో తరగతి పుస్తకాలా కొనలేదు. రాత్రంతా అమ్మ నాన్నలు మాట్లాడుకున్న విషయాలు గుర్తున్నా బోధపడింది తక్కువే. అందులో తను ఈ బడి మానేసి కొత్త కాన్వెంటులో

చేరుతున్నాడన్నదొక్కటే తెలుస్తోంది. ఎందుకో పరుగు నడకయ్యింది. ఇంత మంచి బడి అమ్మనాన్నలకి నచ్చకపోవడం వాడికి ఆశ్చర్యంగా వుంది. ఆలోచిస్తుంటే నడక - అడుగులు కొత్తగా నేరుస్తున్నట్టు పడుతున్నాయి.

కూలిన గోడ దగ్గరికి వస్తుంటే 'ఒరేయ్ ఇక నుంచి నువ్వు మా బడి కాదు. ఎందుకొచ్చావ్?' ఎవరో వెనుకనుంచి అన్నట్టయింది. తిరిగి చూస్తే ఎవ్వరూ లేరు. 'ఇది నా బడి... ఇదే నా బడి' తనకి తనే అనుకుంటూ గోడ దాటాడు.

బడిలోని వరండాక్లాసు దగ్గరికి నడిచాడు. వందేమాతరం చివర్లో అయినా అందుకొనేవాడు. తప్పిపోవడం ఇదే మొదట అందుకేనేమో వస్తూనే 'పేర్దనయిపోయిందా?' అడిగాడు సింహాచలం.

"లేదురా ప్రార్థన అవలేదు.. యలం కాయలు గాడు రాలేదనే ఇంకా చూస్తున్నాం.." మేష్టారి మాటకు పిల్లలందరూ నవ్వేరు. సింహాచలంగాడు పళ్ళికిలించాడు.

"ఏటి మేష్టుగారు బల్లోకే. చేతిలో పలకా పుల్లా ఏం లేదు. పాఠాలు చెప్పడానికే?... వరేయ్ మీకు కొత్త మేష్టుగారొచ్చారు... " మేష్టారు నవ్వుతున్నారు. పిల్లలంతా 'ఓవ్‌..' అంటూ వంత కలిపి నవ్వి గోల చేస్తున్నారు.

"సైలెన్సు.. చీరేస్తాను నాక్కోపమొచ్చిందంతే.." సింహాచలం.

పిల్లలూ మేష్టారూ అందరూ నిశ్శబ్దమయిపోయి నోటిమీద వేలేసుకున్నారు.

"వెర్రిగుడ్డు" మళ్ళీ సింహాచలమే మెచ్చుకున్నాడు.

మేష్టుగారు కుర్చీలోంచి లేచి సింహాచలం గాడి పిర్రల మీద బెత్తంతో ఒక్కటి కొట్టారు. గాలి బుగ్గెత్తిపోసినట్టు ధూళి పొగ లేచింది.

"ఇంటి నుంచా... సిమెంట్ ఫ్యాక్టరీ నుంచా? వెధవా కూర్చో..." మేష్టారు నవ్వుతూ తిడితే దెబ్బ మర్చిపోయి తన జాగాలో కూర్చున్నాడు సింహాచలం.

సింహాచలం జోబీలోంచి నిన్నటి విరిగిన బల్లముక్క తీసాడు.

"బాగుందిరా పలక... నీలాగే" అంటూ రాసుకోవడానికి మేష్టు గారు సుద్ద ముక్క విసిరారు.

సింహాచలం అన్నీ మర్చిపోయాడు. ఆనందంగా సుద్దముక్క వాసన చూసి ఆప్యాయంగా మాష్టారి వంక చూసేడు.

"అంతిష్టమేట్రా అది. ఒక్క గుటక్కి చప్పరించేస్తావా?" మేష్టారు.

"లేదండీ మాయమ్మ చూస్తే ముగ్గులేయడానికి తీసుకుంతాది" సింహాచలం.

తరువాత మేష్టుగారు ఎటెండెన్సు వేసారు.

అదయ్యాక ఎక్కాలు...

'రెండు - ఒకట్ల - రెండు

రెండు రెండ్ల నాలుగు'

బాణీ కట్టిన పాటలా, భవంతులు బద్దలయిపోయేలా...

'తగ్గించండ్రా..' మేష్టుగారు గొంతు నొప్పెట్టి ఊరుకున్నారు.

అలాగలాగ గడిచి ఇంటర్వెల్లయింది.

గిరి రాలేదు. జ్వరమట. జానకి కాంపెస్ బాక్సులోని ఉసిరికాయలిస్తే సింహాచలంతో పాటు మేష్టుగారు అందుకున్నారు. ఆతర్వాత అందరూ ఆటకుపోయినా సింహాచలం మటుకు మేష్టుగారి చుట్టూ ప్రదక్షిణ చేసాడు. అక్కడికక్కడే తచ్చాడాడు. వాడి వాలకం చూసి 'ఏమిరా ఏటి సంగతి?' మేష్టుగారడిగారు.

"మాకింగిలీసు ఎప్పుడు చెప్పుతారండి?" సింహాచలం.

"తెలుగొకటి నిండార రాదు. ఇంగ్లీషెలరా?" మేష్టుగారు తిరిగి ప్రశ్నించారు.

"లేదు చెప్పండి .... మాయమ్మకి చెప్పాల. " వదల్లేదు సింహాచలం.

"ఐదో తరగతి నుండి ఇంగ్లీషు.. ఎనిమిది నుండి హిందీ".

సింహాచలం సంగతి తెలిసి ఊరుకున్నారు మేష్టుగారు.

వాడు ఇంకా మాష్టారిచుట్టూ తిరిగి, తిరిగి బెంచీ దగ్గర నిలబడి... మేష్టారివంక తన్మయత్వంతో చూసి, ఆప్యాయత నిండి ప్రేమ పొర్లి తట్టుకోలేక మేష్టారి చెయ్యి ముట్టుకున్నాడు. వాడికా స్పర్శ ఏదో తెలియని అనుభూతి నిచ్చినట్టుంది. అది గమనిస్తున్న మాష్టార్ని వాడు గమనించలేదు. తన లేత చేతులకంటే మాష్టారి చేతులు మృదువుగా అనిపించాయి.

"పోరా పిచ్చియలంకాయల సన్నాసి". ముచ్చటగా కసిరేరు మేష్టుగారు.

ఇంటర్వెల్ తరువాత రెండో తరగతి తెలుగు వాచకం చూపించారు మేష్టుగారు. అందరూ కనిపిస్తున్నా కూర్చున్న జాగాల్లోంచి లేచి నిలబడి చూసినాకే కూర్చున్నారు.

'వెన్నముద్ద - సత్యాలు - ఆశ్చర్యలు - జాతి రత్నాలు'.. ఇంకా పాఠాలెన్నో ఏమిటేమిటో మేష్టుగారు చెపుతుంటే, ముందు అట్ట మీది 'రెండు పిల్లులు - ఒక కోతి' కథ చెప్పమని క్లాసంతా ఒకటే గోల. మేష్టుగారు చెప్పక తప్పలేదు.

కథయింది. లాంగ్ బెల్లయింది.

అందరూ పారిపోతుంటే మాత్రం సింహాచలం నాయుడు నెమ్మదిగా మేష్టుగారి దగ్గరికి వచ్చి చిక్కేసి పరుగో పరుగు - వెనక్కి చూడకుండా వెనక దారి గుండా.. ఇంటి కెళ్ళిన దాక

ఆగలేదు. అమ్మతో 'రెండు పిల్లులు - ఒక కోతి' కథ చెప్పిందాక ఆగలేదు. అలసినా జాపోసిపోయినా ఆపలేదు.

సింహాచలం కోరుకున్నది తల్లి ముఖంలో కనిపించలేదు.

"పలకా పొస్తకం లేకుండా బరిలోకే... అలాటి సదువులు సెప్పతన్నర్రా.. ఆ జీతాలాలకి ఎలాగరుగుతాయో? కతలూ కాకరకాయలు సెప్పీడం... సరైపోయింది." రమణమ్మ విసుక్కుంటుంటే "అసలు నిన్ను ముందల బడిలెయ్యాలే అమ్మో.. ' అంటూ సింహాచలం తల్లికి దొరక్కుండా పోయి చెల్లికి కథ చెప్పాడు. అది 'వుంగా వుంగా' అంటే 'వూ కొట్టావూ!? మా బడిలో నువ్వూ చదువుకోవాలి' చెల్లికి ముద్దులిచ్చాడు.

మధ్యాహ్నం తిల్లప్పుడూ రాత్రి తిల్లప్పుడూ రెండో తరగతి తెలుగు వాచకం అట్టమీది బొమ్మ గురించి.. పాఠాల గురించి వసపిట్టలా వాగుతూనే వున్నాడు. అందులో కోతిని తిట్టాడు. పిల్లులు రొట్టెముక్క కోసం మోసపోవడం బాధనిపించింది., 'ప్చ..ప్చ..." విడవని సంగీతమయిపోయింది.

"పిల్లులూ చదువుకుంటే బాగున్ను.." సింహాచలం పక్కమీద కెళ్తూ కళ్ళు ముయ్యబోతూ అన్నాడు.

"పిల్లులా? నీ సదువేదో సూడరాదా?" రమణమ్మ కసిరింది.

"చదువుకుంటే ఏం చేసేవిరా పిల్లులు..." దాలినాయుడు అడిగాడు.

"రొండో తరవతయినా చదూకుంతే ఆ పాఠం చూసయినా కోతికి రొట్టిని పంచమని ఇచ్చీసును కావు" సింహాచలం చెప్పాడు.

దాలినాయ్డు నవ్వుకున్నాడు. 'నా కొడుకు తెలివయినవోడే' అన్నాడు.

"ఎంతోటి తెలివుంతే ఏటి సుకము? "సెప్పీ మప్పీ నాదుడుండొద్దా?" నిట్టూర్చి అంతటితో ఆగక 'ఆడి కరమ్మెలాగుందో'.. పరద్యానంలోకి వెళ్ళిపోయింది రమణమ్మ.

సింహాచలం పాఠాల్ని తలచుకొని తృప్తిగా నిద్రలోకి జారుకున్నాడు.

"ఆడపిల్ల ... సిన్న పిల్ల దాని మాటలాగున్ని.." రమణమ్మ పరద్యానంలోంచి పూర్తిగా బయట పడలేదు.

"మా జీతగాళ్ళూ అదే అన్నారు. డబ్బులు ఏపగిస్తున్నాను. ఇప్పడికే ఆలిస్సిం అయిపోయినాం.. రేపూ ఎల్లుండిలో ఏదో ఒకటి చెయ్యాల" దృఢంగా అన్నాడు దాలినాయుడు.

"ఇవాల్టికి లేన్ది రేపుటికి ఎక్కడ్నుంచి పారొస్తాయి? సెట్టుందా దులిపేస్తాం? లేకపోతే ఎక్కడ పాతర గుమ్మిల దాసినావా? తీసి పొద్దుటే పట్టుకెలిపోడాకి.. లేపోతేటి పట్టు మీద గుడ్లుగానేటి పిల్లలయిపోతాయి?....." రమణమ్మ మాటలకు దాలినాయుడు "అబ్బబ్బా.. నోరిప్పితే అంచెట్టవ్....." కసురుకున్నాడు.

''మరేలా దబ్బలంతోటి నానోరు కుట్టీ..'' రమణమ్మకి కోపం వచ్చింది.

''నీనే ఎలాగో చస్తాన్లే''.. దాలినాయ్డు బదులు పలికాడు.

''నువ్వేనికి సవ్వడం నీనే ఎలాగో సస్తాను.. సవ్వకపోతే సనుగుతాను కదా, ముష్టిదాన్ని.. నోరు మూసుకోను. నాతోటి యే జెంజాటుండదు... నన్నే సంపీ. నీకు ఎవర్తయినా మళ్ళీ వస్తాది. కట్నం తెస్తాది. తెచ్చిన కట్నం తోటి పిల్లల్నీ కాన్వంటుల సదివించొచ్చు. అప్పులూ తీరిపోయి పోయిగుంటాది...'' రమణమ్మ ఆలోచనలు ఎక్కడెక్కడో వుంటే మాటలెక్కడెక్కడికో పోతున్నాయి.

''నోర్మూయ్యి పల్లు రాలగొట్టీగల్ను. నువ్వు తెచ్చీసినావు కాసుల కట్ట. ఇంకెవర్తో వచ్చి ఇరుకాపుడ్లు మోసుకొస్తాది...'' దాలినాయుడు లేచి రమణమ్మ దగ్గరికి వచ్చాడు.

''కాసులు కట్టా కాసులపేరు తేలేదని కదా నీకింత కల్లగసం. మా అమ్మ అయ్యా దిక్కుమొక్కూ లేనోలే. మరలాటప్పుడు నన్నేనికి 'సేసుకున్నావు. అప్పుడు కళ్ళు లేవా?'' చేతులు తిప్పింది రమణమ్మ.

'వుంటే నిన్నెందుకు చేసుకుందును?'

'ఇప్పుడయినా వగ్గీ... వగ్గీ...'

''దెయ్యం పట్టిందేటే? పల్లు రాలగొట్టేనంటే..?''

''పదీసుట్లు ఏటా మాట రాలగొట్టు సూస్తాను..''

రమణమ్మ చెంప చెల్లుమంది.

''నోరెత్తేవంటే చంపేస్తాను''

రమణమ్మ ఆ నడి రాత్రి వేళ గొంతెత్తేదే కాని పరువు పైట నోటికి అడ్డం పడింది. పిల్ల లేచి ఏడుపు. సింహాచలము కళ్ళుపులుముకుంటూ నిద్రలోంచి లేచి కూర్చుండి పోయాడు.

రమణమ్మ పిల్లని ఎత్తి పాలిచ్చింది.

దాలినాయుడు లేచిన కొడుకుని జోకొట్టి పడుకోబెట్టాడు.

రాత్రి రాజి రాజి చల్లారిపోయింది.

సూరీడు తూరకముందే దాలినాయుడు ఇల్లు వదిలాడు.

తనకేమి సంబంధం లేనట్టు బడికి బయల్దేరాడు సింహాచలం.

''ఆదివారం కూడా బడికెళ్ళి పోతన్నా వేటల్లుడా'' సీతాలత్త మాటతో అరుగు మీద అలాగే వచ్చి కూర్చుండి పోయాడు. వాడికి క్షణం గడవడం కష్టంగా ఉంది. నిప్పుల మీద కూర్చున్నట్టు కూర్చోలేక ఇంట్లోకి వీధిలోకి తెగ తిరిగాడు.

ఒకటో తరగతి పాత పుస్తకమే చదివాడు. అందులోని గేయాలు కంఠోపాటన మీద పాడుతూ వుంటే వాడి చెల్లెలు చక్కగా ఆడుకుంది.

"చందమామరావే జాబిల్లి రావే

కొండెక్కి రావే కొత్త పలక తేవే

పల్లకెక్కి రావే పాలపుల్ల తేవే

రెండు ఎక్కి రావే రెండో తరగతి పుస్తకం తేవే"

వాడి 'చందమామ రావే' కి వాడే నవ్వు కొని మురిసిపోయాడు.

ఏమర్థమయిందో వాడి చెల్లీ 'నవ్వునే' వంతపాడింది.

దాలినాయుడు మధ్యాహ్నం తిండికి రాలేదు. రాత్రికి ఆలస్యంగా వచ్చాడు. వస్తూనే తల మోకాల్లో పెట్టుకుని కూర్చున్నాడు.

రమణమ్మ వచ్చి పక్కనే కూర్చుంది.

చాలాసేపు గడిచాక "పద వడ్డిస్తాను.." రమణమ్మే అంది.

"తినకపోతే చచ్చిపోతామా? ముందు పిల్లడి గురించి ఆలోచించు. ఊరంతా తిరిగాను. ఎక్కడా అప్పు పుట్టలే. అందరికీ జాయినింగులూ పుస్తకాలూ ఫీజులూ..." ఆగిపోయి అలసటతో నిట్టూర్చాడు దాలినాయుడు.

కొద్దిసేపు నిశ్శబ్దం..

"ఇంకేది దారి? ... అదొక్కటే మిగిలింది. అదే దారయుంది... సివాచెలం పుట్టిక్కి మీయమ్మోలు పెట్టిన అరుతులం చైనీ, మాయమ్మోలు పెట్టిన వుంగరాలు... పిల్లడివే దాచి పిల్లకి పెడుదుము అనుకున్నాను గాని... ఆట్ని తీసుకెళ్ళు.." రమణమ్మ అంది.

దాలినాయుడు పెళ్ళాం వంక చూసాడు.

ఆవిడ పెనిమిటి వంక చూడ్డం లేదు. ఏదో ఆలోచనతో ఎటెటో చూస్తోంది.

"తనకా పెడితే వెయ్యీ పదిహేనొందలకు మించి ఇవ్వరు... ఫీజులు కనుక్కున్నాను. అన్ని కాన్వెంటులూ వాకాబు చేస్నాను. సుబ్బరావు పిల్లలు చదువుతున్న కాన్వెంటుకయితే ఫీజులటుంచి అమ్మా బాబు బియ్యేలు సదివుండాలట.." దాలినాయుడు చెప్పడం పూర్తి కాలేదు.

"మనం సదువుకుంతే ఆలేనికి? మనంగాని ఆల కాన్వెంటులో పాఠాలు సెప్పాలాయేటి? ఇడ్డూరం గుడ్డెడతుంతె తెల్లుల్లి పాయ పిల్లెట్టిందట.."

"మనకి ఇక్కడ అంత పెద్ద గొడవ లేదు. గాని పట్టణాల్లంట కాన్వెంటులకీ కడుపులో పడీ పడక ముందే పేరు రిజిష్టరు చేయించుకోకపోతే డబ్బున్నా సీటు దక్కదు.." ఈ దఫా కూడా దాలినాయుడు పూర్తిగా మాటడలేదు.

"అలూ లేదు సూలూ లేదు కొడుకు పేరు సోమలింగమంతే ఏటో అనుకున్నాను. ఇదే.." అని అంతలోనే తేరుకొని 'మరి మన పిల్లడ్ని ఎక్కడ జాయినింగో సెప్పబోవు' అంది రమణమ్మ.

"థెరీషియన్, గ్రేస్... అన్నిటికీ అడ్మిషన్లయిపోయాయి అప్పుడే?" అని నోరెళ్ళ బెట్టకు. వేసవి సెలవుల్లోనే సీట్లు ఇచ్చీసారట..."

"మరి ఇంతకీ ఎందల దొరికింది?"

"ఆల్వేస్ కాన్వెంటు..."

"బాగుంతాదా?" ఆత్రంగా వుంది రమణమ్మకు.

"ఎలాగున్నా మనిద్దరికీ డిగ్రీ లేకున్నా ఫరవాలేదన్నారు. ఫీజు మోస్తరుగుంది. ఎడ్మిషన్లు ఎప్పుడూ అవుతుంటాయి..."

"మంచి కాన్వంటు అయితే.." మురిసిపోయింది రమణమ్మ.

"ఫీజులు మూణ్నెల్లకి రొండొందల నలభై ముందుగా కట్టేస్తుండాల. తెల్ల చొక్కా నీలం నిక్కరు అంటే స్కూల్ డ్రస్సులు రెండు. ఆటలకి శుక్రవారంపూటకి తెల్లడ్రెస్సు.."

"మాపీరా తెల్లవేల?"

"నువ్విల గన్నావని ఆల్తోటి చెప్తాన్లే గాని, నల్లబూట్లు సాక్సులు ఇంకా టైయ్యి..! చెప్తొంటే రమణమ్మ అడగబోయింది దాలినాయుడు అవకాశమివ్వలేదు.

"..ఇంకా పుస్తకాలకి ఎల్కేజికి మూడొందలు..."

"ఐదో తరగతి దాక అవేనా?...."

"లేదు ముసిలయిన్దాక అవే... ముందు విను... ఇవన్నీ అటుంచి డొనేషన్ అంటే చేరిపించడానికి ఫీజు పదమూడొందల యాభై రూపాయలు..."

దాలినాయ్డు మాటలాపేసి ఎంత అవకాశమిచ్చినా రమణమ్మకి పలుకు రాలేదు.

"బంగారప్పినర అమ్మీడమే.. జబ్బోజొరమో వచ్చింది. మందూ మాకుల కయిపోయిందనుకోడమే. తృప్తి పడడమే..." తన అసంతృప్తిని మింగి పెళ్ళాన్ని సంతృప్తి పెట్టబోయేడు.

"ఏటో నాకేటి తెల్దు.." రమణమ్మ అనీసింది.

"నాకూ తెల్దని నీనూ చేతులెత్తేస్తే ... గొల్లూ గొడవదే.." అన్నాడు దాలినాయుడు.

“ఇప్పుడంత ఓపిక లేదుగాని తిండెడతాను పద..” రమణమ్మ లేచింది. వెనకాలే దాలినాయుడు కదిలాడు. తిన్నా వంటికి పట్టనట్టే వుందేమో ఆకలిగా లేదు. నిద్ర రాలేదో. ఆ పెనిమిటి పెళ్ళాలకి తెల తెలకవ అవుతుంటే కోడి కునుకు పట్టింది.

సింహాచలం బడికి బయల్దేరబోతుంటే ‘నువ్వింటిదగ్గరుండ్రా... కొత్త పలకా పుస్తకాలు తెస్తాను. కాన్వెంటుల జాయినవుదువు..’ చెప్పేసి దాలినాయుడు బంగారపు చైను, ఉంగరాలు తీసుకొని అమ్మడానికి వెళ్ళాడు.

“అమ్మాఁ... నాక్కాన్వెంటు వద్దే... బడే బాగుందే... నీను కాన్వెంటు కెళ్ళనేఁ...” ఒకటికి పదిసార్లు తల్లితో మొత్తుకోవడమో.. తగువుకి దిగడమో తెలీదుగాని వాడి సాధింపుకి కోపం నెత్తికెక్కి “అవున్రా... నువ్వెందుకెల్తావ్... మావుండలేక ఇన్ని పత్రాకులు పడతన్నాం... ఏటి సిన్న పిల్లడని వదిలేస్తుంటే.. బాగా ఒళ్ళు జర్దుకుంది. నీకు..” రమణమ్మ ఉక్రోషం పెరిగి పోతోంది.

“అమ్మా అయితే నువ్వు కాన్వటు కెళ్ళు. నీను మా బడికి పోతా.....”

సింహాచలం మాట నోటిలో ఉంది. రమణమ్మ చేతిలో వున్న మట్టు గిన్నెతో రెండు మొట్టులు మొట్టింది. సుర్రుమందేమో జుట్టు నులుపుకున్నాడు సింహాచలం. కిర కిరలాడుతూ తిరిగిపోయాడున గాని ఏడవ లేదు. ఏడిస్తే వీగిపోయినట్టే ననేమోనని దుఃఖాన్ని పట్టుదలతో నొక్కి పట్టాడు.

చల్దన్నం పెడితే తినలేదు. కనబడని బడిని కళ్ళల్లోకి తెచ్చుకుంటూ అటే చూస్తున్నాడు.

ఇంతలో దాలినాయుడు వచ్చాడు. పిల్లడ్ని జాయిన్ చేస్సి వస్తానని ముస్తాబు కానివ్వమన్నాడు. ఏమీ చెయ్యకుండా బొమ్మలా నిలబడ్డ కొడుకుని “చిన్న సాన్నవురా... తల దువ్వుకోలేవా? ఉడుంపట్టు గొరకడు.” పెనిమిటికి తెలిస్తే మళ్ళీ గోలని పెదవి దాటకుండా తిట్లని అదిమి పట్టింది. ముక్కు తుడిచి ‘తల దువ్వి పౌడరు రాసి బట్టలు కూడా తొడిగి అన్నీ చేసి ‘తీస్కెళ్ళు’ అంది.

దాలినాయుడు సింహాచలాన్ని సైకిలు మీద కూర్చోబెట్టి తీసుకుపోయాడు.

కాన్వెంటు గేటు ముందు సైకిలు దిగి “మీ కాన్వెంటు ఎంతందంగా వుందో చూడ్రా సింహం..’ ’ దాలినాయుడు కొడుకుని సైకిలు దించాడు.

కొద్ది సేపు ఏమనాలో తెలియకపోయినా “మా బడంత పెద్దది కాదు..”

సింహాచలం నొసలు చిట్లించాడు. తండ్రి సింహమన్నందుకు కూడా పొంగి పోలేదు వాడు.

సైకిల్ని స్టేండులో వుంచి ప్రిన్సిపాల్ గదిలోకి వెళ్ళాక అప్లికేషన్లు గుమస్తాలు నింపాక సింహాచలాన్ని ‘ఇంటర్వ్యూ చేసి తీసుకుంటా’మన్నారు.

“భయపడకుండా చెప్పు... అడిగిన అన్నిటికీ చెప్పు..” దాలినాయుడు గొంతు తగ్గించినా గట్టిగా చెప్పి దేవుడ్ని మొక్కుకున్నాడు. సింహాచలం మాట కాదు, తలా ఊపలేదు.

ఎవరో ఎత్తి సింహాచలాన్ని కుర్చీలో కూర్చోపెట్టారు. వాడికి వెనక్కి వీపు అందక, కిందికి కాళ్ళు అందక అందులో కూర్చోవడం ఇబ్బందిగా వుంది.

ప్రిన్సిపాల్‌గారు అడిగారు.

"నీ పేరు?"

"యలంకాయల సింహాచలంనాయ్డు..."

దాలినాయుడి గుండె పొంగుతుంటే "నువ్వు చిన్నవాడివి అంత పేరు బరువుగా లేదూ? వుంటుంది. అందుకే ఇకనుంచి నీ పేరు... యువర్ నేమ్ వై.యస్. ఛలమ్..." ప్రిన్సిపాల్‌గారన్నారు. దానికి ముచ్చటపడి అక్కడున్న స్టాఫ్‌తో పాటు దాలినాయ్డు నవ్వు తెచ్చుకున్నాడు.

"చూడు ఛెల్మ్ ... మీ నాన్న... డాడీ పేరు?" ప్రిన్సిపాల్ గారు మళ్ళీ మొదలెట్టారు.

"వై.డి. నాయ్డు.." కన్సెల్టెన్సీయో సెక్రెటరీయో ఎవరో అందిచ్చారు.

"బాగా చెప్పావ్ చెల్మ్.. వెరీ నైస్..." అని సింహాచలాన్ని మెచ్చుకుని 'మీ వాడు గొప్ప తెలివైన వాడండీ... ఇలాంటి వాళ్ళే మాక్కావలసింది..." ప్రిన్సిపాల్ గారు ఏకంగా చప్పట్లు కొట్టారు.

"మరి నీకేమిటి యిష్టం?..."

"మా బడంటే యిష్టం ... ఈ కాన్వెంటు కాదు..."

దాలినాయుడితో పాటు ప్రిన్సిపాల్, సెక్రటరీ నుండి సెక్యూరిటీ సిబ్బందిదాక అందరు బెంబేలు పడి తాపీగా సర్దుకున్నారు.

"దటీజ్ ఛైల్డ్ సైకాలజీ... హి ఈజ్ ట్రూ... ఏమయినా పిల్లాడిలో నిర్మోహమాటం, నిజాయితీ వున్నాయి. సీటు ఇవ్వాల్సిందే. ఫీజు కట్టేసి జాయినయి పొండి.." ప్రిన్సిపాల్‌గారు హడావిడిగా వెళ్ళిపోయారు.

దాలినాయ్డు కొడుకుని కుర్చీలోంచి దించి, గుమాస్తా పిలువగా వెళ్ళి రసీదులన్నీ కోయించుకొని, అర బస్తాడు పుస్తకాల సంచీని ఎత్తుకొని బయటపడ్డాడు. ఇంతలో ఇంటర్వెల్ అయిందేమో పిల్లలందరూ గదుల్లోంచి బయటకొచ్చి ఆడుకుంటుంటే ఆశగా చూసి నిరాశని మింగాడు దాలినాయుడు. సింహాచలానికి తన నేస్తాలు గుర్తుకొచ్చారు.

గేటు దాటుతుంటే..

"సార్.. బూట్స్... చీప్ అండ్ బెస్ట్ విత్ సాక్స్.."

"సార్ మా బుక్స్ మీకు టెన్ పర్సెంటు డిస్కౌంట్.."

వాళ్ళిద్దరూ 'నువ్వాగరా..' అంటే 'నువ్వాగరా' దెబ్బలాడుకుంటున్నారు.

శెట్టి, ముసలమ్మ ఎందుకో గుర్తు కొచ్చారు సింహాచలానికి.

"స్కూల్ డ్రెస్‌లకు మా షాప్‌కి రండి."

"మేం హోల్‌సేల్ ధరలకే... మా షాపుకి రండి.."

పాంప్లేట్సు సింహాచలం చేతినిండా పెట్టారు... 'ఇప్పుడు డబ్బుల్లేవు' అసలు విషయం చెప్పి దాలినాయుడు కొడుకుతో అరబస్తాతో సైకిలు నడిపించుకుంటూ ఇల్లు చేరాడు.

పెనిమిటిని చూడ్డంతో "... ఇదేటండి బస్తాతోటి. సరుకులా... నెలమద్దిన, అయినా పిల్లడ్ని జాయినింగు సేసుకొత్తానని ఇదేటి?" అనుమానంతో నొక్కి చూసింది రమణమ్మ.

'పొస్తకాలు' సింహాచలం అన్నాడు.

'మాయల్లుడ్ని జాయినింగ్ సేస్నావా?' సీతాలత్త సంబరం. మన సింహాచలం గోడు కలకటేరయిపోతాడు'. పోలమ్మ ఆనందం అమ్మలక్కల మాటలకి రమణమ్మ పొంగి పోయింది. ఎందుకో ఇందాకటి పొంగు దాలినాయుడికి లేదు.

సేద తీరి, కాళ్ళు కడుక్కొని భోంచేసాక కత మళ్ళీ మొదలయ్యింది.

"కాబోలోడిలా తయారయాడీ పెంటప్పారావు. పాత బాకీ ఎనిమిదొందలు తీసుకొని రెండువేల రెండొందలు బంగారం అమ్మగా ఇచ్చాడు. రెండువేల ఒకొంద కాన్వెంటులోనే అయిపోయింది. ఇంక బట్టలూ బూట్లు..." తల పట్టుకున్నాడు దాలినాయుడు.

"ఏదో పిల్లడ్ని రచ్చించుకున్నాం. ఈడు సదివిన బడిలో పిల్లలకి జొరాలు ఇరోసనాలట. గుంటలు సొమ్మయి పోతన్నారు.." రమణమ్మ పెద్దగా ఊపిరి పీల్చి చెప్తుంటే-

"ఏమయ్యింది.." ఆత్రంగా అడిగాడు దాలినాయ్డు.

"ఏమవుద్ది మనముష్టి ముండ వూరు అలాటిది. కాశీబుగ్గలాటి ఊరు కలకత్తెల్లినా దొరకదు. ఈల యాపారాలారిపోను. బడిలోకెళ్ళడానికి తోవలేకంట బడ్డీలెట్టినారు. షాపులు కట్టినారు. ఇటు జడ్డిడి కొట్టు - అటు జామోడు కొట్టు. మద్దిన సిన్న సంద దిలినారు. అది పిల్లలు ఎల్లీ రాడానికో?... ఉచ్చలు దొడ్లు పొయ్యడానికో తెల్దు. పళ్ళు కూరగాయలూ కుళ్ళినవీ మళ్ళినవీ అదగక్కడే... రొండు సినుకులు పడతోటికి కుళ్ళి ఈగలు దోమలు ఝూమ్మని... పసి పిల్లలా మరేటి? ఈ తీరవ మావు సదువుతున్నపుడు నుండీ వుంది. నీ నందుకే బడికెళ్ళలేదులే. బడి పెట్టి నూటరొండేలట... అందరన్నమాటే" అంటూ వున్న మాట చెప్పి కసిని వెళ్ళగక్కింది రమణమ్మ.

సింహాచలం తల్లినే కన్నార్పకుండా చూస్తున్నాడు.

"ఎప్పుడి పాతపెంకో.. ఉగాలు గడిసినా ఊసెత్తినోడులేక ఉమ్మోసినా వర్షంలాగా కారిపోతాది. వచ్చేదా వర్షాకాలం. గోడలలాగే వున్నాయి...." రమణమ్మ మళ్ళీ అంది.

"అయినా మా బడి బాగుంటాది" తనకి తనే చెప్పుకున్నట్టు అన్నాడు సింహాచలం.

"బడి కాదు కాన్వెంటు.. ఆల్వేస్ కాన్వెంటు" అనాలి తెలిసీ దిద్దాడు దాలినాయుడు.

సింహాచలం విచారంతో కూచున్నాడు.

దాలినాయ్డు పుస్తకాలకి అట్టలు వేసే పనుల్లో పడ్డాడు.

రమణమ్మకి మనసులో ఎప్పుడ్నుంచో యాదిలో ఉన్న పని మొదలెట్టింది. పెరటి పెంటకుప్ప మీద మామిడి మొక్కని "ఏనుగు మావిడి టెంక ఎంత బాగా లేచింది?" అని దాన్ని తవ్వి కుండీలో పెట్టింది. మన్నూ గత్తం పోసింది. నీళ్ళు పోసింది.

"ఏమమ్మా. మొక్క ఇక్కడే వుంతే బాగుంటాది కదే.. పెద్ద సెట్టవుతాది. సెట్టు కింద చెల్లీ నేను ఆడుకుంతాం. ఉయ్యాల కట్టుకుంతాం.." ఎప్పుడొచ్చాడో సింహాచలం తల్లి కొంగు పట్టుకొని అడిగాడు.

"ఇక్కడే వుంతే కోళ్ళూ పందులూ దువ్వేస్తాయమ్మా మొక్క సచ్చిపోద్ది.." చెప్పింది రమణమ్మ. ముద్దుగా చెప్పి కొడుకుని బడియావ వదిలించి కాన్వెంటుకు పంపాలని ఆవిడ యావ.

"మరి.. మరే... గోలేంలోనే మామిడి సెట్టు పెద్దదవుతుందా ఎక్కడైనా?" సింహాచలం మాటకు ఎంత వెతికినా సమాధానం దొరకలేదు రమణమ్మకు.

సింహాచలమే అన్నాడు.

"అమ్మా... మొక్కనిక్కడే వుంచి కోళ్ళు పందులూ దువ్వకుండా ఎలుపు కడితే... ఈ తొక్కులు గిక్కులూ తీసి బాగు చేస్తే...."

"ఇసిగించకెళ్ళు... పెద్ద సెప్పొచ్చాడు మొనగాడు..." రమణమ్మ కసిరేసింది. ఆ కుండీని తెచ్చి పిట్టగోడ పక్కన పెట్టింది.

ఆ రాత్రంతా ఎవరి మీదో తెలీదు గాని సింహాచలానికి కోపం వచ్చింది. ఆ కోపంతోనే నిద్ర పట్టింది. నిద్రలో కల వచ్చింది. కలలో కాన్వెంటు కాలిపోతోంది. బడికయితే బడ్డీలు తీసేసి వెడల్పు రోడ్డు వేసారు. గేటుకి రంగులేసారు. గేటు బయట ముసిలమ్మ ఉడకబెట్టిన ఇచ్చి దుంపల్ని అమ్ముతూ నవ్వుతోంది. కొత్త చీర కూడా కట్టుకుంది. శెట్టి ఎందుకు రాలేదో కనిపించలేదు. బడి లోపలికి వస్తే కొత్త సున్నాలే కాదు కొత్త కొత్త గదులు కట్టి వున్నారు. ఇప్పుడు వరండా వున్నా వరండాలో పిల్లల్లేరు. గదుల్లోనే రెండో తరగతి గదికి ఎర్రటి చందనం రంగు, గోడ ముట్టి చూసాడు. ముక్కు పెట్టి వాసన చూసాడు.

"నాకేస్తావేట్రా? యలంకాయలూ?...."

మేష్టుగారి నవ్వు. తనింకా ద్వారం దగ్గరే నిలబడ్డాడు.

"యలంకాయల సింహాచలం నాయుడూ" మేష్టారు నవ్వుతూ పిలుస్తున్నారు.

"వస్తన్నాను... వస్తన్నాను.." నిద్రలోంచి ఉలిక్కిపడిలేచాడు.

రమణమ్మ పీడకలేమోనని ఆంజనేయ దండకం చదివి వాడి గుండెల మీద తుఫ్‌న వుమ్మి ఎడంకాలి మట్టి తీసి వాడికే బొట్టు పెట్టింది. వాడికి నిద్రపట్టకుండానే తెల్లవారింది.

గురువులు, రాముడు వాళ్ళ పిల్లల్తోటి తల్లి బలవంతం మీద తాపుల మీద కిల్లల మీద ఇష్టం లేకపోయినా కాన్వెంటుకి బయల్దేరాడు.

"కాన్వెంటు డ్రెస్సు వేసుకోపోతే కాన్వెంటుకి రానివ్వరు..." చెయ్యి పట్టుకు నడుస్తున్న శిరీష చెప్పింది.

"అయితే నేనెప్పుడూ డ్రస్సు వేసే వేసుకోను..." సింహాచలం బదులు చెప్పాడు. అడక్కపోయినా బడంటే అప్పుడు తను చదివిందే బడి అని ఎన్నో గొప్పలు చెప్పాడు. ఒక్కసారి మా బడిలో చదివావంటే కాన్వెంటుకి మ(ర్రా)వు. రాబుద్దెయ్యదనీ చెప్పాడు. 'మరి నువ్వెందు కొస్తున్నావంటే 'మా అమ్మా నాన్నకి కాన్వంటు పిచ్చి' అన్నాడు.

కాన్వెంటులోనూ ఇవే మాటలు ఆడితే అందరూ విచిత్రంగా చూసారు.

బెల్లు మోగింది.

క్లాసు ప్రారంభమవుతూనే సింహాచలాన్ని డ్రెస్సు వేసుకు రాలేదని ఎండలో నిలబెట్టారు. బడిలో మేష్టార్ని తెచ్చి ఈ మేష్టార్ని బాదెయ్యాలనుకున్నాడు.

ఇంటర్వెల్లుకి ఇంటికొచ్చేసాడు. కారణం డ్రస్సన్నాడు. బూట్లన్నాడు.

మరుసటి రోజు కాన్వెంటుకి బయల్దేరలేదు. అవి లేకుండా వెళ్తే ఎండలో నిల్చోపెడుతున్నారనీ చెప్పాడు. దాలినాయ్డు కొడుకుని తీసుకు వెళ్తే రెండ్రోజులు టైమిచ్చారు. ఇంటర్వెల్లుకి చెప్పకుండా వెళ్ళిపోయినందుకు డిసిప్లనేరీ యాక్షన్ కింద పదిహేన్రూపాయలు కట్టించుకున్నారు.

దాలినాయ్డు అనుకున్న టైంకి అప్పు పుట్టక... పుట్టిన అప్పుకి వడ్డీలా దర్జీ నుండి బట్టలు రాక డబ్బుల్లేక కటీమిటీ అవుతోంది.

డ్రస్సు ఫెనాల్టి రోజుకీ రెండ్రూపాయలు తొడుక్కొచ్చిందాక కట్టడమే. కొన్న చవక రకం నల్ల ప్లాస్టిక్ బూట్లు కాలుదోపుతుంటే పగిలి పిట్లిపోయాయి. బట్టలొచ్చాక మళ్ళీ బూట్లు...

"ఏబీసీడీ లిచ్చి నెలయ్యింది. ఇంకా ఒక్క బడే రాకపోతే నాలుగు బడులు ఎప్పుడు నేర్చుకుంటావురా?" టీచర్ ఆ రోజు తెలుగులో తిట్టాడు.

సింహాచలానికి అర్థమయి ఆనందమయి అన్నాడు.

"నాకు నాలుగు బడులొద్దు. ఒక్క బడి చాలు.."

"ఓన్లీ ఒన్.. ఒకే ఒక్కటా..." టీచర్ ఆశ్చర్యపోయాడు. తేరుకోకముందే...

"యస్... పీస్.. మా బడి ఒక్కటే నాకు చాలు.."

'ఛెల్మ్' అంటూ చిరాకు దిగిందాక చెవులు తిప్పి వదిలాడు టీచర్.

కిక్కురుమనలేదు సింహాచలం. చొక్కా దులుపుకున్నాడు.

ఆ టీచర్ ప్రిన్సిపాల్‌కి కంప్లయింట్ చేసాడు.

"నువ్వెన్నో తరగతి చదువుతున్నావో తెలుసా?" ప్రిన్సిపాల్ డైరెక్టుగా విషయానికొచ్చి అడిగాడు.

"రెండో తరవతి..."

సింహాచలం చెంప పేలిపోయింది.

"దుంపలబడి కేండేట్స్‌ని తీసుకొస్తే ఇంతే.. రోగ్ ... వీడి బతుకెంతో వీడి బుద్ధంత.." అని అంత ఆలోచించి వీడి పేరెంట్సుని రమ్మనండి... పిలిపించండి... మెమో సింహాచలం చేతికే ఇచ్చారు.

గేటు దాటక ముందే దాన్ని కిళ్ళీ నమిలినట్టు నమిలేసాడు సింహాచలం.

శిరీష వాళ్ళన్నయ్య రవి రోడ్డు మీద పోతుంటే ఆపి సింహాచలం అడిగాడు.

"రొండో తరవతి అంతే ఎంత?"

"రొండే... రొండొకట్ల రొండే.." రవి నవ్వుతూ చెప్పాడు.

"కాదు ఒకటి తర్వాత రొండు.. నీను రొండో తరవతి తెలుసా?" గొప్పగా చెప్పాడు సింహాచలం. కోతి రొండు పిల్లుల కత తెలుసా? అడుగుదామనుకొని "యల్కేజి అంటే ఎంత?" అని అడిగాడు.

"యల్కేజి అంటే రొండు కాదు ఒకటి కాదు సున్న... యల్కేజి తర్వాత యుకేజి. యుకేజి తర్వాత ఫస్ట్ స్టేండర్డ్..."

చెప్పబోతుంటే... "చాలు" అంటూ అతగాని చెయ్యి మీద ముద్దు పెట్టి ఇంటిదాక పరిగెత్తాడు. దారిలో గిరి కనిపిస్తే వాడికో ముద్దిచ్చి, వాడ్ని మాటాడనివ్వకుండా "రేపట్నుంచి నీను మన బడికొచ్చేస్తున్నాను" అరుచుకుంటూ చెప్పాడు.

సింహాచలం ఇల్లు చేరుతూనే 'చెల్లీ' అని గట్టిగా అరిచి మరీ ముద్దు పెట్టుకున్నాడు. ముద్దు మీద ముద్దిచ్చాడు. ఆ పిల్లది ఉక్కిరి బిక్కిరై ఏడు పందుకోబోతుండగ వదిలి పెట్టాడు. అమ్మాం అంటూ అక్కడ్నుంచి పెరటిలోకి పరిగెత్తాడు. పెరటి నుండి మళ్ళీ వీధి గుమ్మంలోకి పరుగుతీసి ధైర్యం చేసి అమ్మకి ముద్దిచ్చాడు. రమణమ్మకి గాని దాలినాయుడికి గాని వాడి ఉత్సాహం అర్థం కాలేదు.

అన్నం తిన్నాడు. పుస్తకాలు తీసాడు. పేజీలు తిరగేసి బొమ్మలు చెల్లికి చూపించాడు.

పిల్లిని చూపించి 'ఇదేటమ్మా' అని అడిగాడు. తను పిల్లిని పిల్లి అంటే పిల్లలంతా నవ్వడం గుర్తుకొచ్చింది. టీచరూ నవ్వడం గుర్తుకొచ్చింది.

'కేటట కేటు. గాడిద గుడ్డు" పైకే అన్నాడు. 'మ్యావేం..' ముద్దుగుంది అనుకున్నాడు. అన్నాడు. 'టింకిల్ టింకిల్ లిట్టిల్ ఇస్టార్' అంటూ చెల్లి ముఖం చూసాడు. అది ఏమీ అనలేదు. చిట్టి చేతుల్తో పుస్తకాన్ని నలిపేస్తోంటే "అరే.. నీకు నచ్చలోదే?" అనుకుంటూ 'చందమామ రావే

జాబిల్లి రావే' పాడాడు. ఆ పిల్లది కదులుతున్న వీడి నోటి వంక ఆశ్చర్యంగా కళ్ళు నిలిపి చూస్తోంది. చెల్లికీ ఇదే నచ్చిందనుకున్నాడు.

పేజీలు తిప్పాడు.

కేరట్.. రిఫ్రిజరేటర్.. రెయిన్ కోట్... ఏవేవో ఏమిటేమిటోగా వున్నాయి. తెలియకుండా వున్నాయి. ఈ పుస్తకం, పాఠాలు తన కోసం కావన్నట్టుగా కూడా అనిపించింది. చెల్లి పుస్తకాన్ని లాగేసింది.

"వద్దా.. వద్దా.. నా తల్లే వద్దులే.." అనేసి ఆ పుస్తకాలన్నీ తీసేసి ఏ మూలనో పడేసి వచ్చాడు.

"నువ్వు మా బడిలోనే చదూకొందువు గాన్లే.." అడగని చెల్లిని ఊరడించాడు.

ఆ పగలూ రాత్రి వాడికలాగే తెల్లవారింది. ఎప్పటిలాగే బడి బెల్లు మోగుతూ వినిపిస్తోంది.

పూనకం వచ్చిన యలంకాయల సింహాచలం నాయుడు 'సింహంలా' విరిగిన పలక ముక్కలూ దండీ పట్టుకొని పరుగు తీసాడు. పోస్టాఫీసు ఎదురు మెయిన్ రోడ్డు దాటి సందులోంచి చెరువు గట్టు మీదినుంచి కూలిన గోడ దారిలోంచి... 'వందేమాతరం' పాడుకుంటూనే పరిగెత్తుతున్నాడు.

రమణమ్మ అరుస్తూనే పరిగెత్తబోయి ఆగిపోయింది.

దాలినాయుడు ఆమె వెనకాలే కొయ్యబారి నిలబడి పోయాడు.

కుండీలో కునికి పోతుందేమో అనుకున్న మామిడి మొక్క బాగా ఏపుగా పెరిగి కుండీనే బద్దలు గొట్టేసింది. కుండీ పగిలిన చప్పుడుకి పెనిమిటి పెళ్ళాలిద్దరూ తులిక్కి పడి చూసారు.

కాసేపు గడిచాక -

రమణమ్మ ఆ మామిడి మొక్కను తెచ్చి పెంట మీద వేసింది. పెంట చుట్టూ ఎలువుకట్టి బాగుచెయ్యాలన్న కొడుకు మాటలు గుర్తుకొచ్చాయి.

'యలంకాయల సింహాచలం నాయుడు గోరొచ్చార్రా?' మేష్టుగారి మాటకి 'సింహం' గాడి ముఖం విప్పారినట్టే మామిడి మొక్క లేత ఆకులు తలతలలాడుతూ మొరుస్తున్నాయి.

★ ★ ★

***తొలి ప్రచురణ :*** *'మన కాలం కథలు' కథా సంపుటి,*
***మలి ప్రచురణ :*** *'ఆహ్వానం' మార్చి, 1997*
***రచనా కాలం :*** *26 జూన్ 1996.*